మరో రెండు నిమిషాలు అటూ ఇటూ అసహనంగా చూసిన యశస్వి ఒక అద్భుతమైన అవకాశం చేజారిపోయినందుకు బాధపడుతూనే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు 'అనసూయ' అనే యువతి హత్య గురించి.

యశస్వి సరాసరి రామసూరి ఇంటికి వెళ్లాడు.

"గుడ్.... మనం కాదు యశస్వీ.... తనను వెంటాడుతున్న ప్రత్యర్థుల చుట్టూ ఉచ్చుల్ని నానీయే అమాయకంగా బిగిస్తూ వాళ్లని శాపగ్రస్తుల్ని చేస్తున్నాడు, రియల్ చైల్డ్ ప్రాడిజీ! కథనిలా మలుపు తిప్పిన నానీ మరింత ప్రమాదంలో చిక్కుకోవడమే కాకుండా మనకీ గట్టిగానే పనిపెట్టాడు. మనకంటే ఎక్కువగా హోం మినిష్టర్ అప్పారావుకి".

"అవును" యశస్వీ అన్న వాక్యం ఇప్పుడు రామసూరికి అర్థంకాలేదు.

"అవును రామసూరిగారు! నా అంచనా తప్పుకాకపోతే మీరన్నట్టుగానే అప్పారావు పోలీస్ డిపార్టుమెంటులో తన మనుష్యుల్ని ఎలర్టు చేస్తాడు. అదే నాకు కావలసింది కూడా!"

ఆ సమయంలోనే హోమ్ మినిష్టర్ అప్పారావు గెస్టుహౌస్‌లో ఉలిక్కిపడి నిద్రలేచాడు ఫోన్ రింగవుతుంటే.

అప్పటికి అర్థగంట క్రితమే రాజధాని నుంచి ముఖ్యమంత్రి ఫోన్ చేసి ఎడా పెడా వాయించేశాడు. పది రోజుల్లో మొదలయ్యే అసెంబ్లీ సెషన్స్‌లో తన పార్టీ యంత్రాంగం నిబ్బరంగా నిలబడాలీ అంటే తను నిర్దోషిగా నిరూపించుకోవాలి అని.

అది సలహాలా లేదు, హెచ్చరికలా వుంది.

పైగా డైరక్టర్ జనరలాఫ్ పోలీస్‌నీ రంగంలోకి పంపుతున్నానన్నాడు.

మళ్లీ అలాంటి ఫోనే అనుకున్నాడు కానీ ఇది కామేశ్వరి నుంచి. అప్పటికే అన్ని వివరాలూ సేకరించిన కామేశ్వరి హరి చేసిన హత్య విషయం తెలియపరచగానే నుదుట చెమట పట్టేసింది "ఇరుక్కుపోయాను కాముడూ".

** ** ** **

అర్థరాత్రి దాటి రెండు గంటలు కావస్తూంది.

నడిచి నడిచి అలసిపోయిన నానీ ఊరికి దూరంగా వచ్చేశాడు.

కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్లు నీళ్లను చిమ్మడం మరచిపోయాయి.

అమ్మంటే ఎప్పుడూ చీకటంటే భయపడేవాడు. పగటిపూట ఇలా నిర్మానుష్యంగా వున్న ప్రదేశంలో నడవాలంటే వణికిపోయేవాడు.

కాని ఇప్పుడు మనుషులంటే భయంగా వుంది.

తూలి పడిపోతానేమో అనిపిస్తుంటే బడలికగా ఓ మట్టి దిబ్బ పై పడుకున్నాడు.

తనెక్కడికొచ్చిందీ ఆలోచించే స్థితిలో లేడు. అలసటగా ఆకాశం వైపుకి చూశాడు.

సరిగ్గా అప్పుడే నానీ ఒంటిపై ఓ చేయిపడింది.

భయంతో కళ్ళు తెరిచాడు.

"ఎవరయ్యా నువ్వూ?" తెల్లని గడ్డంతో తాతయ్య లాగే వున్న ఓ ముసలాయన ఆప్యాయంగా పలకరిస్తున్నాడు "ఎందుకు సిన్నినాన్న! బ్రతికున్నోళ్ళెవరూ రావడానికి ఇష్టపడని సోటుకి నువ్వొక్కడివి .... అందులో ఈ రాత్రివేళ ఎలా రాగలిగావయ్యా! ఇక్కడేం చేస్తున్నావు?"

అప్పుడు తలతిప్పి చూశాడు నానీ .

చుట్టూ తను పడుకున్న మట్టిదిబ్బల్లాంటివే ఇంకా చాలా ఉన్నాయి.

మసక వెన్నెల్లో దూరంగా నేలపై బూడిదలో మండుతున్న నిప్పుకణికలు.

"ఇదేంటీ....." అబ్బురంగా అడిగాడు గెడ్డం తాతయ్య ఆత్మీయతకి నేస్తం కట్టేస్తూ.

"బ్రతికున్న మనుషులు రాకూడని సాసినాలు బాబు!"

"అంటే స్మశానం కదా!" అన్నాడే కాని భయంతో లేచి తాతయ్య ఒడిలో గువ్వలా పోయాడు "మరి నీకు భయమెయ్యదా?"

"భయపడాల్సింది పేనమున్న మనుషులగ్గాని వూపిరిలేని శవాలక్కాదు బాబూ".

భాష ఇంకోలా వున్నా తన తాతయ్యతో మాట్లాడుతున్నట్టే వుంది నానీకి.

"నీ పేరేంటి తాతయ్యా?"

"తవిటయ్య"

"మా తాత పేరు విశ్వేశ్వరశాస్త్రి అన్నమాట, మరేం నాకు మంత్ర పుష్పాలు- నర్సరీ రైమ్సు వచ్చన్నమాట!" ఈ మధ్యకాలంలో ఇలాంటి తాతయ్య సొంత తాతయ్యలా తనను మెచ్చుకునే మనిషే దొరకటంతో చెప్పుకుపోయాడు.

"అలాగా మనవడా! మరి తాతయ్య నొదిలిపెట్టి ఎందుకొచ్చేశావు?"

"బ్రతికించే మందుకోసం."

ఆ తాత ఆశ్చర్యపోయాడు "అది సాసినాల్లో దొరుకుద్దని ఎవరు చెప్పారయ్యా?"

"అయ్యో సాసినాలు కాదు.... స్మశానం. స్మ.... అను."

"మరి నన్ను తాతయ్యా అని పిలుస్తున్నావు కాని- పంతులోరి పిల్లాడివి నన్నిలా ముట్టుకోవచ్చా?".

"ముట్టుకోవచ్చన్నమాట. ఎందుకంటే తాతయ్య ఇది కూడా అంటే ఈ స్మశానం కూడా గుడిలాంటిదే అంటాడు".

"నిజమా?"

"మరేం ఇక్కడ నువ్వు పూజారిలా హారతి పడతావటగా! అందుకే చచ్చిపోయిన వాళ్ళకి అమ్మ దణ్ణం కూడా పెట్టమనేది."

"ఆ తల్లెక్కడుంది బాబూ?"

"చచ్చిపోయిందన్నమాట."

"దేవతలా నీతో ఇన్ని మాటలు చెప్పింది కాబట్టే దేవతల్లో కలిసి పోయుంటుంది." ఏదో గుర్తుకొచ్చినట్లు నానీ తల నిమురుతూ అన్నాడు "అడక్కూడనంత అంటరానోణ్ణి బాబు! అన్నం తింటావా?".

"వద్దు, ఆకలెయ్యడం లేదు."

ఎందుకో కొన్ని గంటల తర్వాత అనుకోని ఈ ప్రశాంతత నానీకి ఆహ్లాదంగా వుంది "అవునూ మీ ఇల్లెక్కడ?".

"అదిగో ఆ మూలనున్న గుడిసె"

"బామ్మ అక్కడే వుంటుందా?"

"లేదు బాబూ!" అన్నాడు "ఎప్పుడో మట్టిలో కలిసిపోయింది".

"మరి నీ కెవ్వరూ లేరా?"

"కూతురుందెక్కడో. ఒకప్పుడు కొడుకుండేవాడు."

"ఇప్పుడెక్కడున్నాడు?"

"ఆరునెల్ల కిందటే ఈ సేతుల్తోనే...." గాద్గదికంగా పలికిందతడి కంఠం.

"అంటే నువ్వు కూడా నీ కొడుకుని చంపేశావా?" అన్నాడు టక్కున.

ఎన్నో మరణాలని.... మరణాల వెనుక కథల్నీ వినీ, చూసీ సంపాదించుకున్న అనుభవం తవిటయ్య భృకుటి ముడిపడేట్టు చేసింది. "నువ్వు గూడా అంటున్నావేంటి మనవడా? ఏ తండ్రయినా కన్నబిడ్డని సంపుకుంటాడా?"

"ఆ.... చంపుకోడేంటి?"

"ఏంటయ్యా! ఏం జరిగింది?" ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు.

"మరేమో మా నాన్న నన్ను చంపేయమన్నాడుగా! అందుకే ఇలాగ పరుగెత్తుకొచ్చేశా!"

"ఇలాంటి బంగారు కొండల్ని సంపుకునే తండ్రులూ వుంటారా బాబయ్యా?" మనసు ద్రవించిపోతుంటే తన చేతుల మీదుగా కాలి ఖననమైపోయిన శవాలున్న సమాధుల వేపు దృష్టి సారించాడు.

మనుషుల్లో ఇలాంటి తెగ ఒకటుందని
అప్పటీదాకా తెలీదా వయోవృద్ధుడికి.

సత్యవాక్పరిపాలన కోసం సర్వాన్నీ కోల్పోయి అలనాడు తనవంటి కాటికాపరి స్థితికి దిగజారిన హరిశ్చంద్రుడి కథ విన్నాడు.

కొడుకు శవాన్ని కాటికి తరలించి సుంకం చెల్లించలేక తెలియకుండా తన భర్తనే ప్రాధేయపడిన చంద్రమతి చరిత్రా విన్నాడు.

కాని....

భార్యను పొట్టన పెట్టుకుని ఇప్పుడు కొడుకు ప్రాణాల్నే తన సుఖానికి సుంకంగా చెల్లించే

తండ్రి కథ ఇంతదాకా వినలేదు.

తవిటయ్య ఇంకా ఆలోచనలనుంచి తేరుకోనేలేదు.

ఓ జీప్ వచ్చి ఆగింది శ్మశాన ముఖద్వారం దగ్గర.

"తవిటయ్యా!"

పిలిచారెవరో!

ఆ కంఠం గుర్తించిన నానీ గభాలున కిందికి దూకి ఓ మూల నక్కేశాడు.

అది గమనించని తవిటయ్య తేరుకుని పక్కకు చూసేసరికి "అర్జెంట్‌గా తగలబెట్టాలి..." అంటూ సమీపించాడు హరి.

అతని భుజంపై వున్న శవం అప్పటికి కొన్ని గంటల క్రితం హరి హత్యచేసిన అనసూయది.

చీకటిలో దాక్కున్న నానీ గుండె వేగంగా కొట్టుకుంటోంది.

తన ప్రస్తావన వస్తుందనిగాని తను హరి కళ్ళబడితే ప్రమాదమని గానీ అప్పుడు ఆలోచించడం లేదు.

చాలా ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

శవాన్ని నేలపై వుంచిన హరి మరో రెండు నిముషాలలో ఓ పెద్ద ప్లాస్టిక్ కంటైనర్ తీసుకొచ్చాడు "పెట్రోలు కూడా తీసుకొచ్చాను. నీ దగ్గర కట్టెలేమన్నా వుంటే వాడేయ్... తెల్లరేసరికల్లా శవం బూడిదై పోవాలి?" చాలా మామూలు వ్యవహారంలా చెబుతూ తవిటయ్య చేతిలో కొన్ని నోట్లుంచాడు.

తవిటయ్య యథాలాపంగా డబ్బందుకున్నాడు.

తాతయ్యంత మంచివాడిగా కొన్ని క్షణాల క్రితం దాకా అనిపించిన తవిటయ్య ఇప్పుడు క్రమంగా కుంచించుకుపోతున్నాడు.

నానీ రెప్పలార్చకుండా చూస్తూనే వున్నాడు.

అక్కడ నేలపై పడున్న శవం కొన్ని గంటలపాటైనా తనకు అమ్మగా మారిన అమ్మలాంటి ఓ ఆడదానిది.

ఆ కొన్ని గంటలలోనే అమ్మలానే అనిపించింది తను బ్రతికినంతకాలం అమ్మగానే వుంటానని మరీ మరీ చెప్పింది.

అంతెందుకు!

అమ్మలా కాపాడబోయేగా తను చచ్చిపోయింది.

అమ్మయితే దగ్గర కొస్తే కాలిపోతావని ఏడ్చింది. కాని ఈ అమ్మ కాల్చేస్తాడు పారిపోమని హరికి అడ్డం పడింది కూడా!